# శరత్ పూర్ణిమ

వాళ్ళిద్దరినీ చిదివి దీపం పెట్టవచ్చు. అంతముద్దు వస్తున్నారు. వాళ్ళిద్దరూ అక్కా తమ్ముళ్ళు. తలంటు పోసుకుని కొత్త చొక్కాలు లాగులూ తొడుక్కున్నారు. ఆడుకుంటున్నారు.

"నేనే—నేనే" ఏదో తమ్ముడు చెప్పబోతున్నాడు.

"ఊం"

"ఊం అంటేకాదే. వినవే—"

"వింటూన్నాగా చెప్పు"

"తలెత్తి వినాలి"

అక్క నవ్వింది. పెద్దాడబడుచు తను ఆ యింటికి. తనకు కోపం రారాదు. అమ్మ చెప్పింది ఆ మాట. అప్పటి నుంచీ—'జానకి' కి కోపంరాదు. కోపం వచ్చినా నవ్వేస్తుంది. జానకికి కోపం వచ్చినట్లు తెలియదు. పెద్దాడబడుచు మరి జానకి. పెద్దాడబడుచంటే—తల్లి అంత. అన్నమాట.

"తలెత్తాను చెప్పు"

"మనం మామయ్యగారింటికి వెళ్దామే—".

"దీనికేనా యింత చేశావ్?" నవ్వింది జానకి.

తమ్ముడికి కోపం వచ్చింది. తమ్ముడు ఎలాగైనా మగబిడ్డ. మగబిడ్డలు కోపాన్నీ ప్రేమనూ అణచుకోలేరు. 'నే చెప్పను పో' అన్నాడు.

"మానాన్నే— చెప్పమ్మా. అల్లాగే వెళదాంలే," అంది జానకి. తమ్ముడి బుగ్గలు పట్టుకు నిమిరింది. అంత కోపం వచ్చిన తమ్ముడూ ఫక్కున నవ్వాడు.

"ఉత్తరమండోయ్." అంటూ పోస్టు జవాను వచ్చాడు. జానకి వెళ్ళింది. ఉత్తరం పుచ్చుకుంది. నాన్నగారికి నేనే యిస్తా 'ఉత్తరమండోయ్ అంటా. నాన్న నవ్వుతాడు' అనుకుంది.

పక్కయింటి పిల్లవాడు టపాకాయలు కాల్చడం మొదలెట్టాడు. జానకి నేరుగా తల్లి దగ్గిరికి వచ్చింది.

"ఏం అమ్మా ఇల్లా వచ్చావు." అంది తల్లి. తల్లికి జానకి అంటే ఎంతో ఆపేక్ష. జానకి పల్లెత్తు మాట పడదు. మా జానకికి అన్నీ మంచి గుణాలే. సీతమ్మవారు మాతల్లి! అనుకుంటుంది వాళ్ళమ్మ జానకినిచూసి.

"టపాకాయలు ఇవ్వవూ అమ్మా!" అంది జానకి.

యింట్లో టపాకాయలు లేవు. దీపావళికి కొన్నవన్నీ జానకీ, తమ్ముడూ కాల్చేశారు. యివాళ అమ్మాయి పుట్టినరోజు. వచ్చేప్పుడు కాసిని పువ్వొత్తులూ టపాకాయలూ తెండని చెప్పింది తల్లి భర్తతో. "వచ్చేప్పుడు తెస్తాలే" అని వెళ్ళాడు ఆయన, ఆఫీసుకు పోతూ.

"అమ్మా, అమ్మా!!" అంటూ వచ్చాడు బాబు. తమ్ముడు రాంగానే జానకి పక్కకు తప్పుకుంది. చూస్తూ నుంచుంది.

"అమ్మా, అమ్మా"

"ఓయ్"

"టపాకాయలేవీ?" అన్నాడు బాబు.

తల్లి క్షణం ఊరుకుంది. బాబు చుడుకువాడు. జానకిలాగా చెప్తే వినడు.

"అప్పచ్చులా?" అంది తల్లి.

"కావే, టపాకాయలే. ఏవీ?" అన్నాడు బాబు.

"సాయంత్రం కాందే."

"సాయంత్రం కావాలేమిటీ?"

"చీకటి పడవద్దూ, కాల్చుకోడానికి?" అంది ఆమె.

"అన్నీ అబద్ధాలే—"

"కావమ్మా. మా నాన్నే. అక్కయ్య పుట్టినరోజు కదా యీవాళ అబద్ధాలు చెప్తామ్మా?" అంది.

అనుమానంగా చూస్తున్నాడు బాబు.

"పోనీ, అక్కయ్యనడుగూ...."

"వాళ్ళబ్బాయి కాల్చడంలా మరీ?" అన్నాడు బాబు.

"అమ్మా, అమ్మా, ఉత్తరం వచ్చిందే—" అంది జానకి.

"ఎక్కణ్ణుంచమ్మా!" అంది తల్లి.

"ఏమో"

"ఇలాతే. చూస్తా," అంది తల్లి.

"ఊఁహూ. నీకివ్వను. నాన్నగారు రాంగానే నాన్నగారికే ఇస్తా"

"తే అమ్మా. తే మరీ" అంది తల్లి.

"నాన్నగారేమన్నారు? ఇంకోళ్ళ ఉత్తరాలు చూడకూడదనలా?" అంది జానకి.

తల్లి నవ్వుకుంది.

"మా అమ్మే" అని కూతుర్ని ఎత్తుకుని ముద్దెట్టుకుంది తల్లి. జేబు లోంచి ఎక్కడ ఉత్తరం లాగుతుందో అని జాగ్రత్తగానే జేబు దగ్గర చెయ్యి పెట్టుకుంది జానకి.

"నన్నెత్తుకోమరి!" అన్నాడు బాబు.

తల్లి జానకిని దించింది.

యింతలో పక్కయింట్లో టపాకాయలమోత బాగా వినబడటం మొదలెట్టింది.

బాబు బిక్కమొహం వేశాడు. తల్లికి ఇదయింది. "నాన్నా, పరమాన్నం తిందాం...." అంది.

"టపాకాయలు" అన్నాడు బాబు.

"నాన్నగారు వచ్చాక, అక్కయ్యా, నువ్వూ, కాలుద్దురు గాని" అంది ఆమె.

"నువ్వో....?"

"నేనూను" అంది ఆమె నవ్వుతూ.

"మామయ్యో!...."

"మామయ్య ఎందుకూ?" అంది ఆమె. హఠాత్తుగా మామయ్య ఏమిటో అర్థం కాలేదు ఆమెకు.

మామయ్యగారింటికి పోదాం అంటూ తమ్ముడు అన్నమాటను జానకి తల్లికి చెప్పింది.

"వెళ్దాంలే అమ్మా, మామయ్య గారింటికేనా? వెళ్దాంలే అమ్మా" అంది తల్లి.

"మామయ్య, మామయ్య" అంటూ బాబు కిందికి దిగాడు.

టపాకాయలమాట కాస్త మరిచిపోయాడుగదా అని తల్లి సంతోషించింది. పిల్లల్నిద్దర్నీ పడమటింట్లోకి తీసుకుపోయింది. పరమాన్నం పెట్టింది.

సాయంత్రం అయింది. వీధిలో దీపాలు వెలిగించారు. దీపాలు బారులు బారులుగా కనబడుతున్నై.

"నాన్న రాలా?" అడిగాడు బాబు. యింతసేపూ బాబు ఆగాడు. నయం. ఇక ఆగడు. తల్లికి ఈ సంగతి తెలుసు. పనిమనిషి చేత కొద్దిగా టపాకాయలూ అవీ తెప్పించింది.

"ఎప్పుడొస్తాడే నాన్న" అంటూ మళ్ళీ వచ్చాడు బాబు.

తల్లి ఆకాశదీపం వెలిగిస్తోంది.

"దణ్ణంపెట్టు బాబూ" అంది.

"ఎందుకూ"

"ఆకాశదీపంకాదూ, దణ్ణంపెట్టాలి. జానకీ, జానకేదీ?" అంది తల్లి.

"అక్కయ్యను పిలుచుకురానా?" అన్నాడు బాబు.

"ఊఁ"

"టపాకాయలిస్తావా మరి!"

తల్లి నవ్వింది.

ఇంతట్లోకి జానకి చక్కావచ్చింది.

"దణ్ణం పెట్టమ్మా" అంది తల్లి.

"దణ్ణం పెట్టు బాబూ" అంది మళ్ళీ.

తాను దణ్ణం పెట్టింది.

అందరూ దణ్ణం పెట్టాక, దీపాన్ని తాటికి కట్టి ఆకాశానికి ఎత్తింది. దీపారాధన కాంగానే జానకి, తనలో తాననుకున్నట్లు 'నాన్న రాలా' అంది.

తల్లి నెమ్మదిగా దీపాలు వెలిగించింది. ఒక్కొక్కటీ వీధి వాకిలి దగ్గిర గూళ్ళల్లో పెట్టింది.

ఆయన యింకా యింటికి రాలేదు.

"టపాకాయలు కాల్చుకోరూ" అంది.

టపాకాయలు టపాకాయలు అంటూ బాబు గబగబా వస్తూ పడ్డాడు. దెబ్బ తగల్లేదు.

"అమిత తొందరమ్మా" అనుకుంది. వెళ్ళి పిల్లాణ్ణి బుజాన వేసుకుంది.

వీపురాచింది. నేలను కొట్టింది. బాబు ఏడుపు మానాడు.

తెప్పించిన టపాకాయలు కాసినీ యిద్దరికీ యిచ్చింది. వీధిలో పిల్లలు గల్లంతు గల్లంతుగా టపాకాయలు కాలుస్తున్నారు. తనుగూడా పిల్లలతోపాటు వచ్చింది తల్లి. గుమ్మంలో తాను నుంచుంది. యిద్దరి పిల్లలచేతా కాల్పించింది. ఐపోయినై. వారు యింకా యింటికి రాలేదు.

"ఇంకా కాసిని" అన్నాడు బాబు.

"పోనీ, నావి తీసుకోరా" అంది జానకి. జానకి పెద్దాడబడుచు. పెద్దాడబడుచు అంటే తల్లి అంత.

"తే" అని, అవీ కాల్చేశాడు బాబు.

"అన్నాలు తినరూ" అంది ఆమె.

"పువ్వొత్తులు కావాలి" అన్నాడు బాబు.

"నాన్నగారు వచ్చాక" అంది ఆమె.

"బాబు మారాం పెట్టాడు." జానకి తమ్ముణ్ణి సముదాయించింది.

పిల్లలు అన్నాలు తిన్నారు. యింకా రాలేదు.

పిల్లలకు నిద్దరవొస్తోంది. జోగుతున్నారు.

యింకా రాలేదు.

"ఇంతాలిస్యం చేశారేమిచెప్మా" అనుకుందామె.

"అక్కడికీ వెళ్ళేప్పుడు చెప్పాను గూడానూ" అనుకుంది మళ్ళీ.

"యింతపొద్దోయినా రాలేదేం అనుకుని వీధిలోకి చూసింది. రావడం లేదు.

"ఎప్పుడొస్తారో ఏమో" అనుకుని పిల్లవాడి దగ్గిర పడుకుంది. నాన్నగార్కి వుత్తరం యిస్తా అని నిద్ర మానుక్కూర్చున్న జానకి కూడ నిద్ర పోయింది.

వీధిలో పిల్లలమోతగూడా ఆగిపోయింది.

అప్పుడు వచ్చాడు అయన. వస్తూనే ఉస్సురుమన్నాడు.

"పొద్దోయి వచ్చారేం?" అంది ఆమె.

అతను మాట్లాడలేదు.

"సినీమాకు పోయారా?" అంది.

తనూ, పిల్లలూ రాందే ఆయన సినీమాకు పోడని తెలుసు. ఐనా అనాలని అంది.

"అబ్బా లేదే" అన్నాడు ఆయన. చిరు చలికాలంలోగూడా ఆయనకు గొంతిక పొడి ఆరిపోయింది అప్పుడు.

"మీరొస్తారు వస్తారని చూసి చూసి పిల్లలు యిప్పుడే పడుకున్నారు" అంది.

"పాపం" అన్నాడు భర్త.

"ఏం అల్లా వున్నారు?"

"ఉద్యోగం పోయిందా?"

"ఛ"

"నిజం"

"చెప్పనన్నా చెప్పారుకాదూ," యిదేమిటమ్మా యింతలో వచ్చింది దిక్కుమాలిన చీకటి.

ఏదో జరుగుతోందని తెలుసు. యింట్లో చెప్పడం దేనికని చెప్ప లేదు.

"నన్ను యివాళ పనిలోనుంచి తీసేశారు" అన్నాడు ఆయన.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"కాళ్ళు కడుక్కోండి, భోజనం చేద్దురుగాని" అంది.

అతను వెళ్ళి కాళ్ళు కడుక్కుంటున్నాడు. జానకి చప్పుడు విని లేచింది.

"నాన్న వొచ్చాడా" అంది.

"ఒచ్చా నమ్మా" అన్నాడు నాన్న.

"పువ్వొత్తులు తెచ్చావా నాన్నా" అంది.

తేలేదని చెప్పలేకపోయాడు అతను.

"వొచ్చేటప్పుడు కాసిని తీసుకు రాకపోయారుటండీ" అంది ఆమె మెల్లగా, బాబు లేస్తే- ఏం మారాం పడతాడా అని.

లెక్కంతా చూచి 'చెక్కు' ఇచ్చారు అన్నాడాయన.

"నీకు ఉత్తరం వచ్చింది నాన్నా" అంటూ పక్కమీంచి లేచింది జానకి.

"మీకేదో ఉత్తరం వచ్చిందిట. తనే ఇస్తానని నాకు చూపించ నన్నా లేదు అది" అంది తల్లి.

"ఏదమ్మా" అని తీసుకున్నాడు నాన్న. దీపం దగ్గిరికి వచ్చి కవరు చింపి వుత్తరం చదువుకున్నాడు.

"ఎక్కణ్ణుంచండీ" అందామె.

"మీ తమ్ముడు వ్రాసేడే. ఇదుగో, వినూ."

"బావకు నమస్కారాలు. అక్కయ్యను అడిగానని చెప్పండి." జానకికీ బాబుకూ నా ముద్దులు. నేనిక్కడ క్షేమంగా ఉన్నా. మీరున్నూ క్షేమంగా ఉన్నారని భావిస్తున్నా. ఉభయకుశలోపరి.

ఇక్కడ నీకు మంచి ఉద్యోగం చూశాను బావా. అక్కడపడి. ఎన్నాళ్ళని బాధపడతావు? ఇది మంచి ఉద్యోగం. నీవు వచ్చి చేరవచ్చు సెలవు పెట్టిరా. ఓ వేళ సెలవు ఇవ్వకపోతే— ఆ ఉద్యోగాన్ని తన్నేసి మరీరా. అన్నీ ఆలోచించే మరీ రాస్తున్నానిది. అందరం కలిసివుందాము. ఎక్కువ జీతం గూడాను. నా మాటవిని, ఒకసారి రా బావా".

"నేననుకుంటూనే ఉన్నా. అమ్మాయి పుట్టినరోజు ఇది. ఎన్నడూ చెడు జరగలేదీరోజున. ఇవాళ ఇవాళ ఇలా జరిగిందేమిటీ అని. పోతే పోయింది లెండి పాడు ఉద్యోగం. రాత్రింబవళ్ళూ రెక్కలు విరుచు కున్నా—మెప్పులేదు!"

"బాగానే ఉంది" అన్నాడాయన.

"మామయ్య దగ్గిరకి పోదాం నాన్నా" అంది జానకి.

"మాతల్లే అలాగే పోదాం" అని జానకిని ముద్దాడాడు తండ్రి. మా తల్లి వుండగా చీకటా. నేను, మా అమ్మ, మాయింటికి, శరత్ పూర్ణిమ." అన్నాడు తండ్రి.